ఏకగ్రీవాల హవా

ఏర్పేడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ఉప ఎన్నికల నామినేషన్ల ఉప సంహరణ అనంతరం సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. పెనుమల్లం సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు తూముల సునీత, జంగాలపల్లి వార్డు సభ్యురాలిగా బొర్రా చాముండేశ్వరి, మడిబాక వార్డుకు సుబ్బమ్మ, పంగూరు వార్డుకు వెంకటమ్మ, కందాడు వార్డుకు లక్ష్మీదేవి ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారి సురేంద్రనాథ్ తెలిపారు. వారికి డిక్లరేషన్ పత్రాలు అందజేశారు.

పెన్నలపాడు సర్పంచ్ ఏకగ్రీవం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం పెన్నలపాడు సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు పి.రేవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ నాలుగు నామినేషన్లు దాఖలాలు కాగా పరిశీలనలో మూడు నామినేషన్లు తిరస్కరించారు. దీంతో రేవతి ఎన్నిక ఏకగ్రీవమైంది.

బీఎన్‌కండ్రిగలో నాలుగు వార్డులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి 7వ వార్డుకు కేశవులు, వీఎస్ పురం 3వ వార్డుకు వెంకటమ్మ, నెరిణికండ్రిగ 6వ వార్డుకు గంగమ్మ, కాటూరు 6వ వార్డుకు మున్నెయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాబు తెలిపారు. జీఎన్‌కండ్రిగ 6వ వార్డు ఎస్టీకి రిజర్వు కావడంతో వార్డులో ఎస్టీలు లేకపోవడంతో వాయిదా పడిందన్నారు.



ఏర్పేడు: సర్పంచ్‌గా ఎన్నికైన సునీతకు డిక్లరేషన్ అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి

నారాయణవనంలో రెండు వార్డులు

నారాయణవనం: నారాయణవనం 4వ వార్డుకు ఏలుమలై, డీకే పాళ్యం పంచాయతీ 4వ వార్డుకు మహేష్ ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. వీరికి డిక్లరేషన్ ఫారాలను అందజేశారు. జెడ్పీ ఫైనాన్స్ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి అభినందించారు.

రేణిగుంటలో ఒకటి

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లి 6వ వార్డుకు కుంట్రపాకం చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం ఐదుగురు నామినేషన్లు వేయగా, వారిలో నాలుగు నామినేషన్లు తిరస్కరించారు.

పిచ్చాటూరు: మండలంలోని అడవికొడియంబేడు సర్పంచ్ స్థానానికి ముగ్గురు నామినేషన్ వేయగా ఎం.మణి నామినేషన్ ఉపసంహరించుకున్నారని, కిరణ్‌కుమార్, ఎం.ఎస్ రవి బరిలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ఏవీ సుబ్బారావు తెలిపారు. గోవర్ధనగిరి 7వ వార్డులో బాలసుబ్రమణ్యం రాజు, ఆరుముగం బరిలో ఉన్నారన్నారు. అడవిశంకరాపురం 1వ వార్డు ఏకగ్రీవం అయ్యింది.



తొట్టంబేడు: పెన్నలపాడు సర్పంచ్‌గా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రేవతి

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిములం మంగళవారం నారాయణవనంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండాను ఎగురవేస్తారని తెలిపారు. 9 గంటలకు కమ్యూనిటీ భవనంలో జరిగే మండల స్థాయి నా భూమి–నా దేశం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ విజయలక్ష్మి

సత్యవేడు: మండల పరిధిలోని నరసరాజు అగ్రహారంలో రూ.2 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ ధనలక్ష్మి మాట్లాడుతూ.. కాలనీలో 43 మీటర్ల సిమెంటు రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్ బాలాజీ, కె.చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ కుముద పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21వ తేదీ పరిశీలన, 22న ఇంటర్వ్యూ అనంతరం 23వ తేదీ అభ్యర్థులకు సమాచారం ఇస్తామని తెలిపారు. అదే రోజు విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

శ్రీకాళహస్తి: మండలంలోని ఈశ్వరయ్యకాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెల్ప్ టు రూరల్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు సోమవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకటేశ్వర్లు, కుమార్, రాజేష్, శేషు, హెచ్‌ఎం జ్యోతిదేవి, ఉపాధ్యాయురాలు శిరీష పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో నటుడు జోగినాయుడు



ఆలయ ధ్వజస్తంభం వద్ద జోగినాయుడు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం సినీనటుడు, ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో రచయితలు, ఎంఈఓ

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం పాఠశాలలో ఎంఈఓ కె.రవి తెలుగు తల్లికి కవితల పూలమాల పుస్తకావిష్కరణ చేశారు. చెన్నైకు చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్లు పసుపర్తి బద్రినాథ్, పీఆర్ కేశవులు ఈ పుస్తకం రచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాతూ.. విద్యార్థులు పుస్తక పఠనంతో మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు, గ్రామస్తులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌బాబు, బత్తెయ్య, యువరాజ్, రోసయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీ అందుకుంటున్న నాగలాపురం జట్టు

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌లో ఊత్తుకోట జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో నాగలాపురం యూత్ అసోసియేషన్ జట్టు, మూడో, నాలుగో స్థానాల్లో రామాపురం, పెరియపాలెం జట్లు నిలిచాయి. విజేతలకు ఎంపీపీ సింధూ శ్యామ్, సర్పంచ్ సుధా బహుమతులు అందజేశారు.

పిల్లల చదువు.. భవితకు వెలుగు

బుచ్చినాయుడుకండ్రిగ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సతీష్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీకి చెందిన విద్యార్థులు మహేష్, వెంకటేష్, అఖిల్, అల్లెయ్య బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నట్లు గుర్తించారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు సతీష్, సీఆర్‌పీ ప్రసూన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని బీఎన్‌కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. గతంలో వీరు ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదువుతూ డ్రాపౌట్ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని తెలిపారు. పిల్లలను చదివిస్తే ఆయా కుటుంబాల జీవితాల్లో కూడా మార్పు వస్తుందని తల్లిదండ్రులకు హితవుపలికారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను బడికి పంపితే ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద తల్లికి ఏటా రూ. 14 వేలు ఇస్తుందని అవగాహన కల్పించారు.



విద్యార్థులను బడిలో చేర్పిస్తున్న హెచ్‌ఎం

యజమానికి తెలియకుండానే ఇల్లు బదలాయింపు



బాధితురాలు మహబూబ్ బీ

వరదయ్యపాళెం: రెవెన్యూ అధికారుల అవినీతి, నిర్లక్ష్యంతో ఏకంగా నివాసముంటున్న ఇంటినే ఆన్‌లైన్‌లో మరొకరిపై నమోదు చేసిన ఘటన మండలంలోని ముస్లింపాళెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహబూబ్ బీ పేరుపై కొన్నేళ్లుగా సీఎల్‌ఎన్‌పల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 91/4లో 12 సెంట్ల స్థలం ఉంది. అదే స్థలంలో ఓ వైపు ఇంటిని సైతం నిర్మించుకుని నివాసం ఉంటోంది. అయితే ఎలాంటి ఆధారాలు లేకుండానే అబ్దుల్లా అనే యువకుడు తన పేరిట రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాడు. వృద్ధురాలు మహబూబ్ బీని తక్షణమే ఇల్లు ఖాళీ చేయమని బెదిరింపులకు గురి చేస్తుండడంతో సోమవారం ఆమె తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై తహసీల్దార్ గౌరిశంకరరావు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు.

పకడ్బందీగా భూముల రీసర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వే కోసం రికార్డులను పక్కాగా సిద్ధం చేయాలని తహసీల్దార్ భార్గవి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో భూముల రీసర్వేపై వీఆర్‌ఓలు, సచివాలయాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే రైతులకు ఓ వరమని పేర్కొన్నారు. రైతులందరూ భూముల రీసర్వేకు సహకరించాలని కోరారు. సర్వేలో అన్ రిజిస్టర్, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని చెప్పారు. డీటీలు చంద్రబాబునాయుడు, శివయ్య, ఆర్‌ఐ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ భార్గవి

పట్టాలు ఇవ్వాలని ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలో దళితులు సాగు చేసున్న భూములకు పట్టాలు ఇవ్వాలని దళితులు, సీపీఎం నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి జనార్ధన్ మాట్లాడుతూ.. నెలవాయి గ్రామంలో ఇళ్లు నిర్మించుకున్న గ్రామకంఠం భూమిని ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో రెడ్ మార్కు ఉన్నందున క్రయ, విక్రయాలకు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని, గ్రామ కంఠం భూములు ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో రెడ్ మార్కును తొలగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ భార్గవికి వినతి పత్రం ఇచ్చారు. సీపీఎం నాయకులు ధనంజయులు, కేశవులు, మల్లికార్జున, రామయ్య, చలమయ్య పాల్గొన్నారు.

పసుపు, కుంకుమ ఊరేగింపు

నారాయణవనం: ఏడు గంగమ్మల జాతరను పురస్కరించుకుని గంగమ్మ ప్రతిమ తయారీకి వినియోగించే పసులు, కుంకుమను నారాయణవనం వీధుల్లో సోమవారం ఊరేగించారు. నారాయణవనం, సముదాయం, వీకే పాళ్యం, ఎగువ, దిగువ బొప్పరాజుపాళ్యాలు, నాగిలేరు గ్రామాల్లో బుధవారం ఏడు గంగమ్మలను కొలువుదీర్చనున్నారు.

ఆగమోక్తంగా పల్లకీ సేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత కుమారస్వామి పల్లకీ సేవ సోమవారం ఆగమోక్తంగా జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకారంలో కుమారస్వామి

అమరరాజ వ్యవస్థాపకునికి జీవిత సాఫల్య అవార్డు

రేణిగుంట: అమరరాజ బ్యాటరీస్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రనాయుడు జీవితసాఫల్య పురస్కారాన్ని అందుకోవడం సంతోషకరమని ఆ సంస్థ ఎండీ గల్లాజయదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తయారీ రంగంలో ఆయన చేసిన విశేష కృషిని గుర్తించి బెంగళూరుకు చెందిన సత్యసాయి విశ్వవిద్యాలయం ముద్దనహళి వద్ద ఈనెల 11న జరిగిన ఇండియా స్టార్టప్ ఫెస్టివల్‌లో అవార్డును ప్రదానం చేశారు. 2023 ఆర్థిక సంవత్సరంలో 1.75 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధించినట్లు గుర్తు చేసుకున్నారు.



గల్లా రామచంద్రనాయుడు

తాగునీటి ట్యాంకు ప్రారంభం

నాగలాపురం: మండలంలోని వడ్లకుప్పం దళితవాడలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం ప్రారంభించారు. కొద్ది రోజులుగా గ్రామంలో తాగునీటి సమస్య నెలకొనడంతో స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆదిమూలం సమస్యను పరిష్కరించారు. ఎంపీపీ సింధూ, వైస్ ఎంపీపీ కుమారి, సర్పంచ్ చిన్నదొరై, పార్టీ నాయకులు అపరంజిరాజు, మోహన్ మొదలియార్, ఉదయ కుమార్ రెడ్డి, సురేష్, సునీత, మురళి రెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్ కులశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బాధితులకు ప్రభుత్వ సాయం

సత్యవేడు: మండలంలోని రాచపాళెంలో ఇళ్లు కోల్పోయిన వేలు కుటుంబానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తహసీల్దార్ షేక్ జరీనా బేగంతో కలిసి 50 కేజీల బియ్యం, రూ.8 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి రూ. 3వేలు, మాస్టర్ స్కూల్ చైర్మన్ రూ. 3 వేలు చొప్పున బాధితులకు అందజేశారు. సర్పంచ్‌లు రూబెన్, గోవిందస్వామి, రవి రెడ్డి, శ్రీనివాసులు, గోవిందస్వామి, రమణ, చిన్నా పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నాగలాపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడులో జరిగిన 5వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నాగలాపురం, పిచ్చాటూరు, పుత్తూరు విద్యార్థులు ప్రతిభ చూపారు. వివిధ విభాగాల్లో సత్తా చాటి బహుమతులు అందుకున్నారు. విద్యార్థులు, కరాటే కోచ్ ఎస్.ఏలుమలైను పలువురు అభినందించారు.



ట్రోఫీలు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

'గాలి' మాటలు వద్దు..!

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): టీడీపీ నేత గాలి మురళీనాయుడు గాలి మాటలు మానుకుంటే మంచిదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు హితవుపలికారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. ఆయన వెంట ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, పీఏసీఎస్ చైర్మన్ పోతుగుంట మణినాయుడు, కన్నలి భాస్కర్‌రెడ్డి, చెరుకు నరసింహనాయుడు, భాస్కర్, రమణయ్యనాయుడు, శంకరయ్య ఉన్నారు.